


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కొన్ని కులాసా కబుర్లు

### తోకలేని పిట్ట

మధ్యాహ్నం "పోస్ట్" అన్న కేక వినిపించి కిందకి పరిగెత్తాను. బాక్స్‌లో తెల్లటి కవర్. ఆతృతగా తీసి చేతిలో పట్టుకుంటే బరువుగా గుండె నిండా ఆనందాన్ని నింపింది. మా పెద్దక్క అమెరికా నుండి వ్రాసిన ఉత్తరం! మా పెద్దబ్బాయి "'ఈమెయిల్' రోజుల్లో కూడా ఇంకా ఉత్తరాలేమిటమ్మా?" అని ఆశ్చర్యపోయాడు. నేను ఒక చేత్తో కాఫీ కలుపుతూ ఉత్తరం అంతా గబగబా చదివేశాను. 'ప్రొద్దుటే పంచరత్నాలు వింటాను... డిష్‌వాషర్‌లో గిన్నెలు తోముతాను.... నిన్న పులిహోర చేసాను దగ్గరనుండీ తన మనవడు చేసే అల్లరీ, రెండైనా నిండని ఆ టెంక వెధవ 'లీవ్ మీ ఎలోన్ అమ్మమ్మా' అని విసుక్కోవడం గురించీ అది కళ్ళకి కట్టినట్టు వ్రాసిన ఉత్తరం! రాత్రి పనంతా అయ్యాక టీ.వీలో వస్తున్న నా డెయిలీ సీరియల్ కూడా చూడకుండా మళ్ళీ చదివాను. మర్నాడు ప్రొద్దుటే పేపర్ చదివేసాకా మళ్ళీ ఉత్తరం తీసి చదివాను. ప్రతిసారీ అదే కొత్త అనుభూతి! దటీజ్ ఉత్తరం! ఈ అనుభూతి ఏ మెయిలూ, ఎస్.ఎమ్.ఎస్ ఇవ్వగలదూ?

అసలు ఉత్తరం అంటే చిన్నతనంలో మా చిన్న అమ్మమ్మ నుండి అక్కగారైన మా అమ్మమ్మకి వచ్చినదే ఉత్తరం. చీమలంత అక్షరాలతో, తపాలా బిళ్ళ కూడా అంటించటానికి జాగా లేకుండా, చిరునామా వ్రాసే చోట కూడా 'ఈ తపాలా శాఖ వాళ్ళా.. నా ప్రేమకి ఎల్లలు విధించేది' అన్నట్టు దూసుకెళ్ళి అక్షరాలు నిండా ఆప్యాయత కురిపించేది ఆవిడ.

"అటక మీద పెట్టిన పనసపండు ముగ్గినట్టుంది వాసనొస్తోంది.... అప్పడాల పిండి కలిపాను సీతతో వత్తించి పంపుతాను... మా రిక్షా రాములుగాడు తాగి పెళ్ళాన్ని కొడితే అది పుట్టింటికిపోయింది... పనమ్మాయ్ నూకాలు మళ్ళీ నెల తప్పింది... ఎదురింటి ప్రసూనాంబ గారి కోడలి రెండో తమ్ముడికి మన గాడిచెర్ల పురుషోత్తమరావుగారి రెండో అమ్మాయి ఆడబిడ్డ పంకజాన్ని ఇస్తున్నారు... దగ్గర్నుంచీ ఊరెడు విశేషాలతో మొత్తం రాజమండ్రిని పదిహేనుపైసల కార్డుతో బంధించి హైదరాబాద్‌కి ఎక్స్‌పోర్ట్ చేసి ఊపిరి పీల్చుకునేది!

మేమూ చిన్నప్పుడు తెగ ఉత్తరాలు రాసుకునేవాళ్ళం. రెండో క్లాసులో శలవు చీటీ వ్రాయడంతో ప్రారంభమయిన విద్య కళగా, సరదాగా ఎదిగి మా అక్క చెల్లెళ్ళ మధ్యా, అన్నదమ్ముల మధ్యా ఎంతో సాన్నిహిత్యాన్ని ఈ నాటికీ కాపాడుతూనే ఉంది.

'చిట్టీ అయీహై.. ఆయీహై... చిట్టీ ఆయీ..' అన్న పాట వినగానే ఎంత మధురానుభూతికి లోనవుతామూ? తోకలేని పిట్ట..... తొంభై ఆమడులు ఎగురు... అన్న పొడుపు కథే వినని తెలుగువాడు ఉండడు కదా!

ఇంక లేఖలలో ప్రేమలేఖల విషయానికొస్తే వాటి మీద పెద్ద పెద్ద గ్రంథాలూ, సినిమాలే తీసారు. అసలు ఉత్తరం అన్నది మొదట ఎవరు కనిపెట్టారో కానీ... అది లేకపోతే రుక్మిణమ్మ మన కృష్ణయ్యకి వర్తమానం పంపగలిగేదా? జగదోద్ధారకుడికి కళ్యాణం జరిగేదా? అందరి ఉత్తరాలకీ మేఘుడు పోస్ట్‌మేన్ కాలేడు కదా! అలాగే హంసలూ కావ్యాల్లో తప్ప కనిపించని ప్రాణులు కదా! ప్రియురాలి విరహం ప్రియుడికీ... ప్రియుడి తాపం ప్రియురాలికీ తెలియచెయ్యడానికి ప్రేమ లేఖల్ని మించిన సాధనాలేవీ? కొన్ని ఏళ్ళుగా తెలుగు సినీ పరిశ్రమ వీటి మీద సొమ్ము చేసుకుంటోందిగా.ప్రేమలేఖ లేని లవ్ మేరేజ్ ఉంటుందా అసలు? అంటే.. ఉంటుంది అని నేనే జవాబు ఇవ్వాల్సి వస్తోంది... మాది లవ్ మేరేజే... కానీ మా ఆయన పెళ్ళయ్యేదాకా ఒక్క ప్రేమలేఖ కూడా వ్రాయలేదు. పెళ్ళయ్యాకా.. నేను వ్రాసే అవకాశం ఇవ్వలేదు. ఒక్కనాడు కూడా ఆయన్ని స్వేచ్ఛగా వదిలి పుట్టింటికి పోలేదు.వెళ్ళినా ఆర్.టీ.సీ కాలనీలో వాళ్ళది నాలుగో లైనూ.. మాది మొదటి లైను.గట్టిగా అరిస్తే వినిపించేది. వీధి ఊడవడానికొచ్చే అమ్మాయితో 'మా ఆయన్ని ఒక్కసారి రమ్మనవా!' అని వర్తమానం పంపేదాన్ని. లేదా ఏ ఆకు కూరలమ్మాయితోనో తరువాత ఎప్పుడు పుట్టింటి కెళ్ళినా సాయంత్రానికి వచ్చేసేదాన్ని.కానీ.. ఒకసారి నేను నాగ్‌పూర్ మా పెద్దమ్మగారింటికి వెళితే ఆయన ఇంగ్లీషులో సోఫిస్టికేటెడ్‌గా మొత్తం రాసి, చివర్లో అత్తయ్యగారికి 'నమస్కారాలు' అని వ్రాసారు..... దాంతో ఆయన తెలుగు బండారం బయటపడింది. 'అయ్యో పాపం! ఇంగ్లీషు మీడియమా అని తెగ జాలిపడ్డాను!

అయినా ఉత్తరాలు వ్రాయడం ఒక కళ. అందరికీ రాదు. నెహ్రూగారు జైల్లో కూర్చుని రాస్తేనె మనకో ప్రధానమంత్రి తయ్యారయింది.

చిన్నప్పటినుండీ ఎద్దుమైలారం శ్రోతలు చిన్నప్పా, గుండు కాశీ, బాలమ్మా, పోతరాజూ, సంస్థాన్ నారాయణ్ పూర్ శ్రోతలు లడ్డూమియా, వెన్నెలవేణీ, వన్నెల వాణీ మొదలైన వాళ్ళు వివిధ భారతిలో 'మీరు కోరిన పాటలు' కోరుతూ ఉత్తరాలు వ్రాయబట్టేగా మనికిన్ని తెలుగుపాటలు రోజూ వినే అవకాశం దొరికింది! అంతేకాక లేఖావళిలో 'మొన్న మధ్యాహ్నం మీరు రేడియోలో ప్రసారం చేసిన మైసూర్ లడ్డూ కార్యక్రమం వింటూ స్వీట్ చేస్తుంటే కరెంటు పోయి అది హల్వా అయింది అనీ..... మధ్యాహ్నం కార్మికులకార్యక్రమంలో 'చిన్నక్కా ఆకు మడులూ, తెల్లదోమా, నల్ల మిడతా ఎర్రతెగులూ తెల్లదోమా, మొక్కలకి రాకుండా ఎలా చూసుకోవాలి లాంటి ఉత్తరాలు వ్రాసే వాళ్ళు ఉండబట్టేగా మన ఐ.క్యూ పెరుగుతూ వచ్చిందీ. ఇవన్నీ అయిపోయాకా దూరదర్శన్ ఆవిర్భావం అక్కడా విజయ దుర్గో, రోజారాణో కూర్చుని ప్రేక్షకులు కృష్ణుడు పాత్రకి పెట్టిన విగ్గు సరిపోలేదనో.... మొన్న స్త్రీల కార్యక్రమంలో పర్వత వర్ధినిగారు కట్టుకున్న చీర బాగుందనో, మెచ్చుకుంటూ, విమర్శిస్తూ ఉత్తరాలు వ్రాసే వారు కాదూ?...

అంతెందుకూ నా మొదటి నవల సీరియల్‌గా వస్తుంటే, పాఠకులతో ముఖాముఖీ' పేచీకి నాకు వారం వారం సంచిడు ఉత్తరాలు వచ్చేవి. నేను టీచర్ గా పని చేస్తున్న స్కూల్ ఇంటి దగ్గరే కాబట్టి పోస్ట్ మేన్ అక్కడికే తెచ్చి ఇచ్చేవాడు. దాంతో హెడ్ మేష్టార్కి నా ఫాలోయింగ్ గిట్టక నన్ను తీసి పారేశాడు అనుకోండీ... అది వేరే విషయం! కానీ ఉత్తరాల్లో విషయాలే ఇంపార్టెంటు 'అక్కా!... నేను ఐదో క్లాసునుండీ సంచిడు కథలు వ్రాసాను నీకు పంపిస్తాను. దిద్ది ప్రచురించబడేట్లు చెయ్యి అనో' .... 'రమణీ మీ గోత్రం ఏవిటీ నిన్ను లవ్ మారేజ్ చేసుకుంటాను. పైసా కట్నం అడగను' అనీ 'నాకు చిన్నప్పుడు శ్రీశైలంలో తప్పిపోయిన నా కూతురు పోలికలు నీలో వున్నాయి. నువ్వు మీ అమ్మా నాన్నలకి స్వంత కూతురివేనా? అనీ.... 'మగవాళ్ళంటే లోకువా? అమృత వర్షిణికి ప్రేమించేవాడితో కాక వేరే పెళ్ళి చేసావ్... నీ అంతు చూస్తా' అనీ... 'నాకు వెనకా ముందూ ఎవరూ లేని అనాధని నా వయసు పాతికేళ్ళు, ఏ పనైనా ఇప్పించు. నిన్నే నమ్ముకున్నాను' అనీ..ఇలాంటి దడ పుట్టించే బోలెడు ఉత్తరాలొచ్చాయి. కానీ కొన్ని ముఖ్యులదగ్గర్నుండి విలువైన ఉత్తరాలొచ్చాయి. నేను మా తాతగారు సూరంపూడి శ్రీహరి రావుగారి గురించి వ్రాసిన 'లీడర్ పుస్తకం' గురించి, ప్రముఖులు చాలా మంది ఉత్తరాలు వ్రాసారు. వారిలో ప్రఖ్యాత నటులు గుమ్మడిగారూ, చాట్ల శ్రీరాములుగారూ, బి.ఆర్.కృష్ణగారూ, చలసాని ప్రసాదరావుగారూ మొదలైన వాళ్ళున్నారు. అలాగే ఈ మధ్య నాకు యద్దనపూడి సులోచనారాణిగారు వాళ్ళ అమ్మగారి పేరిట 'నెమలికంటి మహాలక్ష్మమ్మ' అవార్డు

ఇస్తూ వెయ్యి నూట పదహార్లుతో బాటు ఒక ఉత్తరం వ్రాసి కవర్లో పెట్టి అందించారు... ఆ ఉత్తరం అమూల్యం! "రమణీ... నేను అమితంగా ప్రేమించే... ఎంతో గౌరవించే మా అమ్మ పేరు మీద అవార్డు నేను ఎంతగానో ప్రేమించే... ఎంతగానో గౌరవించే నీకివ్వడం నాకు ఆనందంగా ఉంది...." అంటూ ఆవిడ ప్రేమని ప్రతి అక్షరంలో కురిపిస్తూ నా ఉజ్వల భవిష్యత్తు కోరుతూ ఒక ఉత్తరం వ్రాసారు. నాకింతకన్నా ఏంకావాలి? నేను కలకన్నది.. కలం పట్టిందీ ఆవిడవల్లే.... ఈ రచయిత్రి జన్మకి ఆవిడే తల్లి! ఆ ఉత్తరం ఇచ్చిన ఆనందం నేను మరువలేనిది. ఆ అక్షరలక్షలు... అలాగే నా అభిమాన రచయిత యండమూరిగారు నా మొదటి కథ 'ముద్దు'కి స్వంత చేతివ్రాతతో 'ఫెయిర్' వ్రాసి ఆంధ్రభూమికి పంపించారు. ఆ ఫోటోస్టాట్ కాపీ చూస్తే నాకెంతో గర్వంగా ఉంటుంది. 'పరుసవేదిలో' పాలో కొయిలో అన్నట్లుగా 'నువ్వు సాధించాలనుకున్నది సాధించడం కోసం ప్రపంచం అంతా నీ మీద కుట్ర పన్ని నీకు సహకరిస్తుంది!'

నేను మొదటి కథ వ్రాస్తే ప్రచురించిన చలసాని ప్రసాదరావుగారు.... వాకాటి పాండురంగారావుగారు రచన శాయిగారు.... కనకాంబరరాజుగారు.... నామిని సుబ్రహ్మణ్య నాయుడుగారు.... శ్రీరమణగారు... ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారు, ఎమెస్కో విజయకుమార్ గారు వీళ్ళంతా ఆశీర్వాదాలతో కుట్ర పన్ని నా రచనాభిలాషని పెంపు చెయ్యలేదా! నన్ను ఒక రచయిత్రిగా నిలబెట్టలేదా!

ఎక్కడో సెక్రటరీలో ఒక సీన్ గురించి 'వాహ్... క్యా సీన్ హై' అని ఉత్తరాల తోటలో మొదలు పెట్టిన ప్రయాణం సిత్తరాల తోట్లో దాకా సాగింది!

మనిషికీ మనిషికీ మధ్య దూరాన్ని తగ్గించేది ఉత్తరం... అనుబంధాన్ని పెంచేది ఉత్తరం... ఆత్మకి ఆహారం ఉత్తరం....ఒంటరితనానికి ఔషధం ఉత్తరం... చెప్పలేని భావాల్ని మనసులకి నచ్చ చెప్పేది ఉత్తరం... పిల్ల తెమ్మెరలో స్వాంతనని అందించేదీ... మనసుమీద పన్నీరు చిలకరించేదీ ఉత్తరం! ఇది ఉత్తమాట కాదు! ఉత్తమమైన మాట!